సాక్షి జోగులాంబ గద్వాల

శుక్రవారం ၊ 22 ၊ మార్చి ၊ 2024

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-33
(శుక్రవారం సాయంత్రం)

సహర్ 4-57
(శనివారం తెల్లవారుజామున)



దర్జాగా ఇసుక దందా

దుందుభి వాగులో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.7 /23.1

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి



నారాయణపేట: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి సరిహద్దు నేరాలకు సంబంధించిన సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలని, సమన్వయంతో పనిచేసి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని రాయిచూర్ ఎస్పీ నిఖిల్ పోలీసు అధికారులకు సూచించారు. గురువారం కర్ణాటక, తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు, ఏపీలో పార్లమెంట్ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాయచూర్‌లోని శక్తినగర్‌లో ఎస్పీ నిఖిల్ ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ బార్డర్ కో ఆర్డినేషన్, నేరాలపై పోలీసు అధికారుల కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇంతకుముందు ఎన్నికల సమయంలో సరిహద్దు జిల్లా పరిధిలోని గ్రామాల్లో ఎలక్షన్స్ సంబంధించి పాత నేరాలు, గొడవలు, సమస్యలు, కేసుల నమోదు, రౌడీ షీటర్స్, అనుమానిత వ్యక్తులు మొదలగు వారు ఎన్నికల సమయంలో ఏమైనా సమస్యలు సృష్టించారా అని ఆరా తీశారు. చెక్‌పోస్టులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మద్యం, నగదు, గంజాయి, విలువైన వస్తువుల అక్రమ రవాణాను నియంత్రించడానికి తీసుకోవాలన్సిన జాగ్రత్తలు, నకిలీ ఓటర్ల విషయాలపై చర్చించారు. సమావేశంలో నారాయణపేట జిల్లా నుంచి డీఎస్పీ లింగయ్య, క్రిష్ణ ఎస్ఐ నవీద్, గద్వాల పోలీసులు, ఏపీలోని మంత్రాయం, కర్ణాటక పోలీసులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతుల్లో మిగిలిన బ్యాక్‌లాగ్ సీట్లను భర్తీ చేసేందుకు గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్సీఓ నాగార్జునరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, వచ్చే నెల 21న అర్హత ప్రవేశపరీక్షను నిర్వహిస్తామని చెప్పారు.


ఎస్సీ గురుకులాల్లో ప్రవేశాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా వివిధ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్సీ బాలికల గురుకుల ప్రిన్సిపాల్ వాణిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

● నాడు వైభవం..
నేడు నైరాశ్యం

అంతలోనే ఎంత మార్పు!

- గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న బీఆర్ఎస్
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కుదేలు
- పాలమూరులో అనూహ్య రాజకీయ పరిణామాలు
- ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల వేళ షాక్ మీద షాక్‌లు
- 'గులాబీ' అభిమానుల్లో కలవరం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: తెలంగాణ ఉద్యమంతో ప్రారంభమై.. రాజకీయ పార్టీగా ఆవిర్భవించి.. తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల పాటు పాలన సాగించిన బీఆర్ఎస్ ప్రస్తుతం గడ్డుపరిస్థితులు ఎదుర్కొంటోంది. ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా ఎదురులేని శక్తిగా ఆవిర్భవించిన ఆ పార్టీ.. ఒకే ఒక్క ఓటమితో కుదేలైంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం.. ఆ తర్వాత అనూహ్యంగా మారిన రాజకీయాలు 'కారు'ను కోలుకోలేని విధంగా దెబ్బతీస్తున్నాయి. వరుసగా ప్రజాప్రతినిధులు, నాయకులు 'గులాబీ'ని వీడుతుండడం.. అదే దారిలో కేడర్ సైతం పయనిస్తుండడం.. ఇలా రోజురోజుకూ షాక్‌లపై షాక్‌లు తగులుతుండడం ఆ పార్టీ ముఖ్యనేతలను నిద్రపట్టకుండా చేస్తున్నాయి. ఓ వైపు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక.. మరోవైపు లోక్‌సభ ఎన్నికల వేళ పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు 'గులాబీ' అభిమానులను కలవరపెడుతున్నాయి.

పదేళ్లుగా హవా..

పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్‌కు మంచి పట్టు ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో కరుడుగట్టిన కార్యకర్తల బలం ఉంది. అందుకే ఆ పార్టీ 2014, 2018 సాధారణ, లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించింది. 2014లో ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏడు స్థానాలు.. రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఒక స్థానంలో విజయం సాధించింది. 2018 ఎన్నికల్లో ఏకంగా 13 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలు గెలిచి ఎదురులేని శక్తిగా ఆవిర్భవించింది. కొల్లాపూర్‌లో గెలిచిన ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సైతం గులాబీ గూటికి చేరడంతో జిల్లా నుంచి ప్రతిపక్షాల గొంతు చట్టసభల్లో లేకుండాపోయింది. ఆ తర్వాత జిల్లాలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ఆ పార్టీ ఘనవిజయం సాధించుకుంటూ వచ్చింది.

ఒక్క ఓటమితో కుదేలు..

బీఆర్ఎస్ రెండు పర్యాయాలు అంటే పదేళ్ల పాటు అధికారంలో ఉండగా.. ఆ పార్టీ నేతల హవా కొనసాగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేవలం రెండు స్థానాల్లో (గద్వాల, అలంపూర్) మాత్రమే విజయం సాధించింది. ఈ ఒక్క ఓటమి బలమైన ఆ పార్టీని కుదిపేసింది. నేతలు రెక్కొలొచ్చిన పక్షుల్లా ఎవరి దారి వాళ్లు చూసుకుంటుండడంతో ఆ పార్టీ కుదేలైంది. పార్టీని వీడుతున్న వారిలో కొందరు బీఆర్ఎస్ హయాంలో పార్టీ, ప్రభుత్వ పదవుల్లో ఉన్న వారు తమకు ప్రాధాన్యం ఇవ్వలేదని చెబుతున్నారు. మరికొందరు మాత్రం పలువురు ముఖ్యనేతల నిరంకుశత్వం, అణచివేత ధోరణితో పాటు వ్యవహారశైలి కారణమని.. ఈ పార్టీలో ఉంటే రాజకీయ భవిష్యత్ కనుమరుగవుతుందని.. అందుకే మూటముల్లె సర్దుకుంటున్నట్లు నిర్మోహమాటంగా అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు.

మరింత వేగంగా ఆపరేషన్ ఆకర్ష్..

ఎన్నికలకు ముందే ఇద్దరు ఎమ్మెల్సీలు కసిరెడ్డి **నారాయణరెడ్డి,** కూచకుళ్ల దామోదర్‌రెడ్డితో **పాటు మాజీ** మంత్రి జూపల్లి కృష్ణారావు, **గద్వాల జిల్లా** పరిషత్ చైర్‌పర్సన్ సరిత, నారా**యణపేట జెడ్పీ**చైర్‌పర్సన్ వనజ బీఆర్ఎస్‌ను **వీడారు. వీరిలో** కసిరెడ్డి, జూపల్లి ఎమ్మెల్యేలుగా **గెలిచారు. తా**జాగా నాగర్‌కర్నూల్ ఎంపీ **రాములు బీజే**పీలో చేరి అక్కడి నుంచి తన **తనయుడు భర**త్ ప్రసాద్‌కు సీటు ఇప్పించుకు**న్నారు. ఇటీవ**ల మహబూబ్‌నగర్, వనపర్తి **జిల్లా పరిషత్** చైర్మన్లు కూడా 'కారు' దిగారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహబూబ్‌నగర్, కోస్గి మున్సిపాలిటీలు హస్తగతమయ్యాయి. ప్రస్తుతం గద్వాల పుర చైర్మన్‌తో పాటు 16 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. అదేబాటలో వనపర్తిలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు పదవులకు రాజీనామా చేశారు. కొల్లాపూర్‌లో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు హస్తం గూటికి చేరారు. నాగర్‌కర్నూల్‌లో ఏడుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఇక ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, ద్వితీయ శ్రేణి నేతలైతే లెక్కేలేదు. జరుగుతున్న ఈ పరిణామాలను చూసి తాజామాజీలు కంగుతింటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ మరింత వేగం అందుకున్నట్లు తెలుస్తోంది.

పార్టీని వీడుతున్నా ప్రేక్షకపాత్రేనా..

కసిరెడ్డి నారాయణరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఉపఎన్నిక ఈ నెల 28న జరగనుంది. ఇందులో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన ఇద్దరు, ముగ్గురు నేతల్లో ఒకరిని బరిలో దింపాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆలోచన చేసినట్లు సమాచారం. అయితే వాళ్లు ససేమిరా అనడంతో పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నవీన్‌కుమార్‌రెడ్డిని బరిలో నిలిపారు. పార్టీ కేడర్, నేతలు సమన్వయం, చిత్తశుద్ధితో పనిచేస్తే బీఆర్ఎస్ అభ్యర్థి తప్పకుండా ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించే అవకాశముంది. మొత్తం 1,439 ఓట్లలో 900 మందికి పైగా ఓటర్లు బీఆర్ఎస్‌కు చెందిన వారే ఉన్నారు. ప్రస్తుతం వీళ్లంతా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. అయినా గులాబీ నేతలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. చేసేది లేక నిస్సహాయులుగా ఉండిపోతుండడం పట్ల కరుడు గట్టిన గులాబీ అభిమానుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

గులాబీ గుభాళించేనా..

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ అధిష్టానం సూచించిన వారు ససేమిరా అనడంతో మహబూబ్‌నగర్‌లో విధి లేక సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికే సీటు ఖరారు చేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. నాగర్‌కర్నూల్‌లో సైతం విచిత్ర పరిస్థితి. మొదట పొత్తుల్లో భాగంగా బీఎస్పీ తరఫున ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను నిలపాలని అనుకున్నారు. ఇరుపార్టీల మధ్య పొత్తు బెడిసికొట్టడంతో విధిలేక ఆర్ఎస్పీ గులాబీ గూటికి చేరడం.. వెంటనే ఆయన పేరును ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం చకచకా జరిగిపోయాయి. ప్రస్తుతం వచ్చే ఎన్నికల్లో గెలిచి పరువును నిలుపుకోవాలని బీఆర్ఎస్ భావిస్తుండగా.. అధికార కాంగ్రెస్, బీజేపీ మాత్రం గులాబీ గుభాళింపు ముగిసిన అధ్యాయమేనని అంటున్నారు.

ఎంపీ అభ్యర్థిగా మల్లురవి

- జాబితా విడుదల చేసిన కాంగ్రెస్ అధిష్టానం
- నాగర్‌కర్నూల్ అభ్యర్థి ఖరారుతో కాంగ్రెస్‌లో ఊపు

సాక్షి, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ మల్లు రవిని ఆపార్టీ అధిష్టానం గురువారం ప్రకటించింది. ఏఐసీసీ విడుదల చేసిన ఎంపీ అభ్యర్థుల జాబితాలో తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు దక్కగా నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవికి అవకాశం కల్పించింది. ఎస్సీ రిజర్వ్ స్థానమైన నాగర్‌కర్నూల్ నుంచి బరిలో నిలిచేందుకు కాంగ్రెస్ నేతలు మల్లు రవితో పాటు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మాజీ ఎంపీ మందా జగన్నాథం తమ ప్రయత్నాలను సాగించారు. అయితే పార్టీ అధిష్టానం చివరకు మల్లు రవికి టికెట్ కేటాయించింది. అభ్యర్థి ప్రకటనతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఇక ఆ పార్టీ క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించనుంది.



నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ప్రొఫైల్

అభ్యర్థి : మల్లు రవి	తండ్రి పేరు: మల్లు అఖిలానంద
పుట్టిన తేదీ: జూలై 14, 1950	చదువు: ఎంబీబీఎస్, డీఎల్‌ఓ
స్వస్థలం: స్నానాలలక్ష్మీపురం, వైరా మండలం, ఖమ్మం	

రాజకీయ నేపథ్యం: మల్లురవి ప్రస్తుతం టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంతో పాటు రేవంత్‌రెడ్డి హయాంలో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా పనిచేశారు. మల్లురవి 1980లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వైద్యుల వింగ్‌కు కన్వీనర్‌గా పనిచేశారు. 1991లో కాంగ్రెస్ తరుపున తొలిసారిగా నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 1996లో మరోసారి పోటీ చేసి ఓడిపోయినా... 1998లో రెండోసారి ఎంపీగా గెలిచారు. 1999లో తిరిగి ఓటమిపాలయ్యారు. 2008లో జడ్చర్ల అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. 2009, 2014లో జడ్చర్ల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2019లో నాగర్‌కర్నూల్ లోక్‌సభకు కాంగ్రెస్ తరఫున మరోసారి పోటీ చేసిన మల్లురవిపై బీఆర్ఎస్ అభ్యర్థి రాములు 1,89,748 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రజలకు తాగునీటిసమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య నిరంతరం సరఫరా అయ్యేలా చూడాలన్నారు. బోరుబావులు, చేతిపంపులను మరమ్మతు పనులన్నీ మూడు రోజులలో పూర్తి చేయాలన్నారు. అందుకు అవసరమైన గ్రామపంచాయతీ నిధులను వినియోగించుకోవాలని తెలిపారు. పైప్‌లైన్లు మోటర్లను కూడా సరిచూసుకోవాలని, పనులలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. సమావేశంలో ఈఈ శ్రీధర్‌రెడ్డి, భీమేశ్వర్‌రావు, సీఈవో కాంతమ్మ, ఇంచార్జీ డీపీవో వెంకట్‌రెడ్డి, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న 'పది' పరీక్షలు

గద్వాల: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం జిల్లా వ్యాప్తంగా 7,212 మంది విద్యార్థులకు 7,181 మంది హాజరుకాగా 31 మంది గైర్హాజరయ్యారు. 99.57 శాతం హాజరు నమోదైంది. మొత్తం 41 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. పదవ తరగతి పరీక్షలలో భాగంగా జిల్లా కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ సంతోష్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాలుగు పరీక్ష కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మూడు పరీక్ష కేంద్రాలను ఆర్జేడీ విజయలక్ష్మి తనిఖీ చేశారు. వీరితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వేర్వేరుగా జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా మండలాల ఎస్సైలు పరీక్ష కేంద్రాల దగ్గర బందోబస్తు నిర్వహించారు. పరీక్ష ముగిసే వరకు అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచారు.



గద్వాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

'చిరు'గానే ధాన్యాల సాగు

మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా.. ఆసక్తి చూపని రైతులు

- అవగాహన కల్పించడంలో వ్యవసాయ అధికారులు విఫలం
- 2023-24లో 3,489 ఎకరాల్లో సాగు



గద్వాల శివారులో సాగు చేసిన జొన్న పంట

గద్వాల వ్యవసాయం: చిరుధాన్యాల సాగు జిల్లాలో తగ్గుతోంది. మార్కెట్‌లో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉంది. అయిన వీటి సాగుపై రైతులు ఆసక్తి కనబర్చడం లేదు. ఇటు వ్యవసాయ శాఖ అధికారులు కూడా వీటి సాగుపై రైతులకు అవగాహన కల్పిండంలో విఫలమవుతున్నారు. దీంతో పాటు ముఖ్య ఆహారపంట అయిన జొన్న సాగు విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బలవర్ధకమైన ఆహారం..

దైనందిన జీవితంలో చాలామంది అనేక రకాలుగా ఒత్తిళ్లకు లోనవుతుండటంతో పాటు, ఆహారపు అలవాట్లలో వస్తున్న మార్పులతో పలు రోగాలు కొని తెచ్చుకుంటున్నారు. బీపీ, షుగర్, ఆస్తమా, కీళ్ల నొప్పులు తదితర వాటికి గురవడంతో పాటు, శారీరకంగా బలహీన పడుతున్నారు. ఇలాంటి వారికి బలవర్ధకమైన ఆహరం చిరుధాన్యాలే. ముఖ్యంగా కొర్రలు, అండుకొర్రల్లో పీచుపదార్థాలతో పాటు, బలమైన పోషక విలువలుంటాయి. రాగుల్లో క్యాల్షియం, ఐరన్ ఉంటాయి. వీటిని ఆహారంగా తీసుకుంటే బీపీ, షుగర్ లాంటి రోగాలు దూరం కావడంతో పాటు, శారీరకంగా బలపడతారు.

అవగాహన.. మార్కెట్ సౌకర్యం లేక..

ఇటీవల కాలంలో చిరుధాన్యాల ఆవశ్యకతపై మేధావివర్గం పలు సూచనలు చేస్తోంది. వైద్యులు సైతం చిరుధాన్యాలను ఆహారపు అలవాట్లుగా చేసుకోవాలని సలహాలు ఇస్తున్నారు. దీంతో వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. అయినా చిరుధాన్యాల సాగుపై రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పత్తి, వేరుశనగ తదితర పంటలపై మొగ్గు చూపుతున్నారు. చిరుధాన్యాలన్ని ఆరుతడి పంటలే. సాధారనంగా రెండు సీజన్లలో సాగు చేయవచ్చు. అయితే ఈ పంటల్లో కలుపు ఎక్కువగా వస్తుంది. దీనికితోడు నూతన యాజమాన్య పద్ధతులపై రైతులకు సరైన అవగాహన లేదు. స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం లేదు. వీటన్నింటి ఫలితంగా జిల్లాలో పత్తి, పొగాకు లాంటి వాణిజ్య పంటలు, వరి లాంటి ఆహరపు పంటలపై ఎక్కువగా దృష్టి సారిస్తూ వస్తున్నారు. కారణం వరి, పత్తి పంటల ఉతపత్తులకు మార్కెటింగ్ సౌకర్యంతో పాటు, మద్దతు ధరకు ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలు చేస్తుండటమే.



మానవపాడు మండలం మద్దూరులో కొర్ర పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

జిల్లాలో సాగు వివరాలు.. (ఎకరాల్లో)

ఏడాది	చిరుధాన్యాలు	జొన్న
2016-17	500	6,881
2017-18	650	4,138
2018-19	1050	3,767
2019-20	271	2,572
2020-21	380	3,412
2021-22	325	4,210
2022-23	539	5,467
2023-24	269	3,220

అవగాహన కల్పిస్తాం

చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అయినప్పటికి ఇక్కడి రైతులు వాణిజ్య, ఇతర ఆహార పంటలపైనే ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. జొన్న పంటకు పిట్టల బెడద ఎక్కువగా ఉంటుంది ఇది కూడా ఒక కారణం. చిరుధాన్యాలు ఎక్కువగా సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తాము.

– గోవిందునాయక్, డీఏఓ

'ఆత్మ'కు నిధుల కేటాయింపు లేక బ్రేక్..

చిరుధాన్యాల సాగుపై వ్యవసాయ అధికారులు ఆత్మ (వ్యవసాయ సాంకేతిక సంస్థ) ఆధ్వర్యంలో 2019లో ఒక్కసారి మాత్రమే అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతులు ఎక్కువగా చిరుధన్యాలు సాగు చేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు జాతీయ ఆహార భద్రత (ఎన్ఎఫ్ఎస్) పథకం కింద పండించే రైతులకు 90శాతం సబ్సిడీపై విత్తనాలు అందించి ప్రోత్సహించారు. దీని వల్ల 2016, 2017, 2018 గణాంకాలను పోల్చితే 2019లో సాగు పెరిగింది. ఆ తర్వాత 2020 నుంచి మళ్లీ తగ్గింది. ఎప్పటి లాగే రైతులు వరి, పత్తిపై దృష్టి సారించారు. ఇదిలా ఉంటే 'ఆత్మ'కు గడిచిన మూడేళ్లుగా నిధులు కేటాయించడం లేదు. దీంతో కార్యక్రమాలకు బ్రేక్ పడింది.

మార్కెటింగ్ సౌకర్యంతో ప్రయోజనం

చిరుధాన్యాలకు బాగా డిమాండ్ ఉన్నందున స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. దీంతో పాటు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది. మెట్ట భూములు ఉన్న ప్రాంతాలను గుర్తించి, వర్షాధారం కింద వేయాలని రైతులకు అవగాహన కల్పించాల్ని అవసరం ఉంది. ఇక జొన్న పోషక విలువలు ఉండే బలవర్ధకమైన ఆహారం. ఈపంట సాగు సైతం తగ్గుతోంది. దీనికి మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు ఉన్నాయి. 10 ఏళ్ల క్రితం వరకు జొన్న సాగు చేసిన రైతులు ఆ తర్వాత వరి, పత్తి లాంటి పంటలను వేస్తున్నారు. ఇక్కడి ప్రాంత ప్రజలు నాణ్యమైన జొన్నలు లభించకపోవడంతో కర్ణాటకలోని రాయచూర్ నుంచి తెచ్చుకుంటున్నారు. జొన్న సాగుపై రైతులకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

మహిళల భద్రత కోసమే టీ- సేఫ్ యాప్

గద్వాల క్రైం: మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందని, అందులో భాగంగానే టీ- సేఫ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని ఎస్పీ రితిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి వారు ప్రయాణించే సమయంలో ప్రయాణ సేవలు అందించేందుకు టీ – సేఫ్ సర్వీసులను పోలీసు ఉమెన్ సేఫ్టీ వింగ్ అదుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఆండ్రాయిడ్ మొబైల్స్‌లో ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే వారు ప్రయాణించే దూరాన్ని ఈ యాప్ మానిటర్ చేస్తుందని తెలిపరాు. ఈ యాప్‌ను మొబైళ్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని, అనుకోని సమయంలో సమస్యలు తలెత్తితే బయటపడేందుకు యాప్ దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఆముదాలు @ 5,600

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో గురువారం జరిగిన టెండర్లలో ఆముదాలు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.5,600, కనిష్టంగా రూ.5,554 ధరలు లభించాయి. సోనామసూరి ధాన్యం గరిష్టంగా రూ.2,052 ఒకే ధర నమోదైంది. మార్కెట్‌కు 200 బస్తాల ఆముదాలు, 40 బస్తాల సోనా అమ్మకానికి వచ్చింది.

క్లుప్తంగా

మునగ చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

అలంపూర్ రూరల్: మునగకాయలు తీసుకునేందుకు మునగచెట్టు ఎక్కి ప్రమదవశాత్తు మృతిచెందిన సంఘటన మండలంలోని బుక్కాపూరంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుక్కాపూరానికి చెందిన చెంచమ్మ కుమారుడు స్వాములు(34) బుధవారం మునగ కాయల కోసం తమ ఇంట్లోని మునగ చెట్టు ఎక్కాడు. మునగ కాయలు తీస్తుండగా.. జారి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందాడు. తల్లి చెంచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. అతడికి ఏడేళ్ల కిందట వివాహమైందని, భార్య గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. అతను కూలి పని చేసుకుంటూ తల్లితో పాటు ఉంటున్నాడని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

నాగర్‌కర్నూల్ క్రైం: అనారోగ్య కారణాలతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్దన్ కథనం ప్రకారం.. గగ్గలపల్లికి చెందిన చెన్నమ్మ (38) చాలారోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో ఈనెల 16న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. కాగా గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఆమె మృతిచెందింది. తండ్రి విష్ణు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: అనారోగ్య సమస్యలను తట్టుకోలేక ఓ మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన దేవమ్మ(35) ఈనెల 20న రాత్రి చౌదర్‌పల్లి సమీపంలో చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు దేవమ్మ కొన్ని రోజుల నుంచి ఫిట్స్ సమస్యతో బాధపడుతుంది. ఈ క్రమంలో పలు ఆస్పత్రులలో చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నటు రైల్వే ఎస్‌ఐ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ మెడలో బంగారు పుస్తెల తాడు చోరీ

పాన్‌గల్: మహిళ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు లాక్కెళ్లిన ఘటన గురువారం మండల కేంద్రం పాన్‌గల్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మద్దెర్ల లావణ్య గ్రామ శివారులో తమ వ్యవసాయ పొలంలో కానుగ చెట్టుకింద మంచంపై కూర్చొని ఉండగా.. ఒక గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఇటు వైపు ఇద్దరు మహిళలు వచ్చారా అని అడిగాడు. దీంతో లావణ్య అతడికి సమాధానం చెప్పేలోగా ఆమె మెడలో ఉన్న 4 తులాల బంగారు పుస్తెల తాడును లాగుకొని పారిపోయాడు. వెంటనే ఆ మహిళ అరుస్తూ వెంబడించగా కనిపించకుండా పారిపోయాడు. నల్లని షర్టు, నల్లని ప్యాంటు ధరించి బక్కగా, పొడువుగా ఉంటాడనే ఆనవాళ్లను ఆమె తెలిపింది. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బియ్యం లారీ పట్టివేత



మాగనూర్: నూకతో కూడిన బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీని బుధవారం రాత్రి మాగనూర్ ఎస్‌ఐ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, ఖిల్లాఘన్‌పూర్ మండలం, సోలీపూర్‌లోని ఓ రైస్ మిల్లు నుంచి నూకతో కూడిన బియ్యం లారీ రాయిచూర్ వైపునకు వెళ్తుంది. నమ్మదగిన వారు ఇచ్చిన సమాచారం మేరకు మాగనూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాన్ని నిలిపి తనిఖీ చేశారు. బియ్యం లోడ్ అనుమానాస్పదంగా ఉండటంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ వారికి సమాచారం ఇచ్చారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్‌ఐ కాలప్ప గురువారం ఉదయం వచ్చి బియ్యం పరిశీలించి మొత్తం 158 క్వింటాళ్లు ఉన్నట్లు గుర్తించారు. అయితే బియ్యం శాంపిల్‌ను ల్యాబ్‌కు పంపించామని, ల్యాబ్‌లో పరిశీలించి పీడీఎస్ బియ్యమని తేలితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ విషయంపై ఇంకా ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ చెప్పారు.

నసరుల్లాబాద్‌లో..

జడ్చర్ల: నసరుల్లాబాద్ మీదుగా వెళ్తున్న ఓ బియ్యం లారీని గ్రామస్తులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే ఏపీలోని శ్రీకాకుళం నుంచి తిమ్మాజీపేట మండలంలోని ఓ రైస్‌మిల్‌కు బియ్యం లోడుతో లారీ వెళ్తుండగా స్థానికులు అనుమానించారని సీఐ ఆదిరెడ్డి తెలిపారు. సంబంధిత బిల్లులు అన్ని ఉన్నాయని తెలిపారు. పూర్తిస్థాయిలో విచారిస్తున్నామని అన్నారు.

దర్జాగా ఇసుక దందా

- అనుమతుల మాటున అక్రమ రవాణా
- నీరుగారుతున్న 'వాల్టా'
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు



దుందుభి వాగు ప్రాంతంలో ఇసుక తవ్వకాలు

జడ్చర్ల: దుందుభీ వాగులో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి. నిత్యం లారీలు, టిప్పర్లలో వందల ట్రిప్పుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇంత దర్జాగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నా.. మైనింగ్, రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలుమార్లు ఫిర్యాదులు చేసి విసిగి వేసారిన రైతులు, విపక్ష పార్టీల నాయకులు ఇసుక వాహనాలను అడ్డుకొని స్వయంగా పోలీసులకు అప్పగించిన ఘటనలున్నాయి. అయితే ఇసుక మాఫియా బలంగా ఉన్న కారణంగా ఎదురుదాడులు చేసే పరిస్థితి ఉందని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వాగులో యంత్రాల సాయంతో ఇసుకను తోడి హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

అప్పట్లో అలా..

బీఆర్‌ఎస్ పాలనలో 2021, అక్టోబర్‌లో మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లి శివార్లలో ఉన్న దుందుభి వాగు నుంచి ఇసుకను యంత్రాల సాయంతో తవ్వి పరిసరాల్లోని వ్యవసాయ పొలాల్లో నిల్వ చేశారు. రాత్రి, పగలు తేడా లేకుండా లారీలు, టిప్పర్లలో ఇసుకను హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలించాలన్న ఉద్దేశంతో ఇసుకను నిల్వ చేశారు. ఇలా నిల్వ చేసిన ఇసుక సుమారు 50 వేల టిప్పర్లకు పైగానే ఉన్నట్లు అంచనా. అప్పట్లో ఇసుకాసురులకు బీఆర్‌ఎస్ పాలకులు సహకారం అందిస్తున్నారంటూ అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్‌పార్టీకి చెందిన నాయకుడు, ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సైతం ఆందోళనకు దిగారు. దుందుభి వాగును సందర్శించి అధికారులు, పోలీసుల తీరుపై మండిపడ్డారు. హైకోర్టును ఆశ్రయించి ఇసుక తరలింపును నిలిపివేయించారు. దీంతో ఇసుక డంపులు అలాగే ఉండిపోయాయి.

ప్రస్తుతం ఇలా..

రెండున్నర ఏళ్ల తర్వాత ఇసుక డంపులకు రెక్కలొచ్చాయి. జిల్లాకేంద్రంలో వైద్య కళాశాల, ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు ఇక్కడి ఇసుక డంపులను వినియోగించేందుకు కలెక్టర్ అనుమతులు జారీ చేశారు. దీంతో కాంట్రాక్టర్ టిప్పర్ల ద్వారా ఇసుకను పని ప్రదేశానికి తరలిస్తున్నారు. అయితే ఇదే అదనుగా అక్రమార్కులు రంగంలోకి దిగి ఇసుకను పక్కదారి పట్టించి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతి ఒక చోటుకు ఉంటే ఇసుక తరలింపు మరో చోటకు వెళ్తోంది. యంత్రాల సాయంతో ఇసుక లోడ్‌చేసి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. నెల రోజులుగా ఇసుక తరలింపు విచ్చలవిడిగా కొనసాగుతోంది.



ఇసుక తరలింపునకు వచ్చిన టిప్పర్లు

వాగు వరకు రోడ్డు..

ఇసుకను సునాయసంగా తరలించేందుకుగాను ఇసుకాసురులు వాగు వరకు ఏకంగా ఓ రోడ్డు నిర్మించారు. వాగు ఒడ్డున ఉన్న ఇసుక డంపులు, వాగులోకి నేరుగా వాహనాలు వెళ్లేందుకు మట్టి రోడ్డును నిర్మించారంటే పరిస్థితిని ఊహించవచ్చు. అయ్యవారిపల్లి మీదుగా ఉన్న రోడ్డుపై ఇసుక తరలిస్తున్న సందర్భంలో గ్రామస్తులు అడ్డుకుంటారన్న ఉద్దేశంతో ఊరికి దూరంగా మరో రోడ్డును నిర్మించి రాకపోకలు సాగిస్తున్నారు.

అధికారుల విచారణ..

విపక్ష పార్టీల నాయకులు, రైతులు ఆందోళనకు దిగడంతో పాటు స్వయంగా టిప్పర్లను పట్టుకొని పోలీసులకు అప్పగిస్తుండటంతో గురువారం మైనింగ్ సర్వేయర్ సుజాత, మిడ్జిల్ ఆర్‌ఐ అంబిక ఘటన స్థలానికి చేరుకొని విచారించారు. వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరిస్తామని వారు తెలిపారు. కలెక్టర్, ఎస్పీలు స్పందించి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని రైతులు, విపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఒకవేళ అనుమతులు ఇస్తే పారదర్శకంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



విచారిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

డార్క్ ఏరియాలో యథేచ్ఛగా

భూగర్భ జలాలు అట్టడుగుకు చేరడంతో ప్రభుత్వం మిడ్జిల్ మండలాన్ని డార్క్ ఏరియాగా గుర్తించింది. డార్క్ ఏరియాగా గుర్తించిన మండలంలో అసలు ఇసుక తవ్వకాలు చేపట్టరాదన్న నిబంధనలు ఉన్నాయి. భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వర్షపు నీటిని ఒడిసి పట్టేలా చెక్‌డ్యామ్‌లు, వాలుకట్టలు, కందకాలు తదితర వాటిని నిర్మించాల్సి ఉంది. ఇలాంటి ప్రాంతం నుంచి ఇసుక తరలింపునకు అనుమతులు ఎలా ఇస్తారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నా అధికారులు ఎంత మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో మున్ననూర్ శివారులో దుందుభిని లూటీ చేశారు. ఇప్పుడేమో కొత్తపల్లి, చిల్వేరు, అయ్యవారిపల్లి శివారులోని వాగును లక్ష్యంగా చేసుకొని దర్జాగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు.

కన్న కొడుకును హతమార్చిన తల్లి

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ఘాతుకం
- నాగర్‌కర్నూల్ జిల్లా అల్లీపూర్‌లో విషాదం



హరికృష్ణ (ఫైల్)



నిందితురాలు లక్ష్మి

బిజినేపల్లి: నవమాసాలు మోసి.. పదకొండేళ్లు పెంచిన కొడుకే వివాహేతర సంబంధం ముందు నిలవలేకపోయాడు. అత్యంత కిరాతకంగా హతమార్చడమే కాక.. చట్టం నుంచి తప్పించుకోవాలని హత్యను ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని అల్లీపూర్‌లో చోటుచేసుకున్న ఈ విషాదకర ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన డేగ రవీందర్, లక్ష్మి దంపతులకు హరికృష్ణ(11)తో పాటు మరో ఇద్దరు కుమారులున్నారు. అందరికంటే చిన్నవాడైన హరికృష్ణ గ్రామంలో ఉండి చదువుకుంటుండగా.. అన్నలిద్దరూ గురుకుల వసతి గృహం పాఠశాలలో ఉండి చదువుకుంటున్నారు. అయితే తండ్రి రవీందర్ తాగుడుకు బానిస కావడంతో తల్లి లక్ష్మి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. తన తల్లి మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండడం హరికృష్ణ పలుమార్లు గమనించాడు. ఈ క్రమంలో తన విషయం కొడుకుకు తెలిసిపోయిందని భావించి.. బుధవారం రాత్రి హరికృష్ణ తలపై కర్రతో బాది, శరీరంలోని ఇతర సున్నిత ప్రదేశాలపై గాయపరిచి చంపింది. దీనిని ప్రమాదంగా చిత్రీకరించాలని వెంటనే బెడ్‌షీట్‌లో మూటకట్టి ఇంటి ముందున్న నీటి సంపులో పడేసింది. తెల్లారేసరికి నీటి సంపులో పడి తల పగిలి తన కొడుకు చనిపోయాడని గ్రామసుతులను నమ్మించే ప్రయత్నం చేసింది. కానీ, హరికృష్ణ తలకు అయిన గాయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ కనకయ్యగౌడ్, ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. లక్ష్మిని అదుపులోకి తీసుకుని, ఆమె ప్రియుడి కోసం గాలిస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణం తీసిన సరదా

- ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

మల్దకల్: వేసవిలో సరదాగా ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు బావిలో పడి మృత్యువాత పడిన సంఘటన ఉలిగేపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మల్దకల్ మండలంలోని ఉలిగేపల్లికి చెందిన బోయ పెద్దలక్ష్మన్న పెద్ద కుమారుడు వీరేంద్ర(14) బిజ్వారం హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం పాఠశాల వదిలిన తర్వాత ఈత కోసం తోటి స్నేహితులతో కలిసి ఉలిగేపల్లి గ్రామ సమీపంలోని సామేల్ వ్యవసాయ బావికి వెళ్లారు. ఈత నేర్చుకునే క్రమంలో వీరేంద్ర ప్రమాదవశాత్తు బావిలో మునిగిపోయాడు. విషయాన్ని గమనించిన తోటి స్నేహితులు భయంతో ఇళ్లకు వెళ్లిపోయారు. వీరేంద్ర చీకటి పడినా ఇంటికి చేరుకోకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వారితో వాకబు చేశారు. అయితే వీరేంద్ర తోటి పిల్లలతో కలిసి ఈతకు వెళ్లినట్లు చెప్పడంతో తల్లిదండ్రులు ఈతకు వెళ్లిన పిల్లలతో వాకబు చేశారు. బావికి ఈతకు వెళ్లిన విషయాన్ని మాత్రమే తోటి పిల్లలు చెప్పడంతో, తల్లిదండ్రులు వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పరిశీలించారు. బావి వద్ద కుమారుడి చెప్పులను గుర్తించారు. బావిలో వెతుకగా వీరేంద్ర లభించాడు. అక్కడి నుంచి నేరుగా గద్వాల ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. గురువారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు చేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలియజేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు గ్రామానికి చేరుకుని బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపి, సెలవు ప్రకటించారు.

డీఆర్‌డీఏ కార్యాలయ సామగ్రి మాయం



కుప్పలుగా పడ్డ పాత ఫైళ్లు

- కార్యాలయ మార్పు సమయంలో గోల్‌మాల్
- జిల్లా మహిళా సమాఖ్య భవనంలో లేని సామగ్రి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఓ (గ్రామీణాభివృద్ధి శాఖ) కార్యాలయానికి సంబంధించిన విలువైన సామగ్రి కనిపించడం లేదు. మహబూబ్‌నగర్ కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ భవనంలో డీఆర్‌డీఓ కార్యాలయం కొనసాగేది. అప్పట్లో ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 2023 జులైలో జిల్లా కేంద్రం బండమీదిపల్లిలోని జిల్లా మహిళ సమాఖ్య భవనంలోకి మార్చారు. ఇదే ఏడాది డిసెంబర్ 2వ తేదీన కొత్త కలెక్టరేట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కేవలం 5 నెలల కోసం అంబేద్కర్ భవనంలో ఉన్న డీఆర్‌డీఓ కార్యాలయాన్ని జిల్లా మహిళా సమాఖ్యకు మార్చడంపై పలు విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో కార్యాలయంలోని సుమారుగా రూ.35 లక్షల విలువైన సామగ్రి అక్కడికి చేరలేదు.

పనికి రాదనే నెపంతో ఇళ్లకు..

పాత సామగ్రి పనికి రాదనే పేరుతో ఉద్యోగులు, సిబ్బంది ఇళ్లకు తరలించారనే ఆరోపణలు ఉన్నాయి. 2023 డిసెంబర్ నెలలో ప్రారంభమైన కలెక్టరేట్ ప్రాంగణంలోకి డీఆర్డీఏ కార్యాలయాన్ని మార్చారు. ఈ క్రమంలో ప్రత్యేకంగా ఫర్నీచర్, ఇతర సామగ్రి కోసం ప్రతిపాదనలు పంపించారు. ఆ సామగ్రి కూడా త్వరలో రానుండటంతో పాత ఫర్నీచర్, ఇతర సామగ్రి మాయం చేశారని సమాచారం. కార్యాలయాల్లో పనికిరాని వస్తువులు ఉంటే దుకాణాల నుంచి టెండర్లు ఆహ్వానించి నిబంధనల ప్రకారం వ్యాపారులకు అప్పగించాలి.

తుక్కు పేరుతో అమ్మినట్లు సమాచారం

కార్యాయలం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఇనుప సామగ్రి తుక్కు పేరుతో అమ్మినట్లు సమాచారం. ఇందులో ఈజీఎస్‌కు సంబంధించిన వందల గడ్డపారలు, పెద్ద సుత్తేలు, పారలు, ఇతరత్ర సామగ్రి ఉన్నట్లు తెలిసింది. దీంతో పాటు కార్యాలయంలో ఉపయోగించిన పార్టీషన్ పూర్తిగా మాయం అయ్యింది. దీనికి వినియోగించిన రూ.15 లక్షల సామగ్రి ప్రస్తుతం జిల్లా మహిళా సమాఖ్య భవనంలో కనిపించడం లేదు. ఈ కార్యాలయంలో ఉపయోగించే కంప్యూటర్లను యథావిధిగా కొత్త కార్యాలయానికి తరలించగా, పాత కంప్యూటర్ల జాడ మాత్రం కనిపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఓ జిరాక్స్ యంత్రం, ప్రింటర్లను మాయం చేసినట్లు తెలుస్తోంది. కొన్ని కుర్చీలదీ ఇదే పరిస్థితి. అన్నింటి విలువ కలిపి సుమారు రూ.35 లక్షలకు పైగానే ఉంటుందని అంచనాలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఇద్దరు అధికారులు ప్రధాన పాత్ర పోషించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో అప్పట్లో ఉన్న ఉన్నతాధికారికి అన్ని చూసుకునే ఆ ఉద్యోగి పాత్ర ఉందనే విస్తృతంగా ప్రచారం జరిగింది.



జిల్లా మహిళా సమాఖ్య భవనంలో ఉంచిన బీరువాలు, అల్మారాలు, ర్యాకులు

తుప్పు పడుతున్న బీరువాలు, ర్యాకులు

జిల్లా మహిళా సమాఖ్య భవనంలో కేవలం ర్యాకులు మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా రక్షణ లేకపోవడంతో బీరువాలు, ర్యాకులు తుప్పు పట్టిపోతున్నాయి. చెక్క అల్మారాలు, ఫైళ్లు, సంచుల్లో కట్టి భద్రంగా దాచాల్సిన ఫైళ్లను ఇష్టానుసారంగా పడేశారు. రక్షణ లేకుండా వేయడంతో బీరువాలు, ర్యాకులు ఇతర సామాగ్రి దొంగల పాలవుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి.

దొంగల హల్‌చల్

- చందాపూర్‌లో నాలుగు ఇళ్లలో చోరీ



అచ్చంపేట రూరల్: అచ్చంపేట మండలం చందాపూర్‌లో గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు ఇళ్లలో చోరీకి పాల్పడి బీభత్సం సృష్టించారు. అచ్చంపేట ప్రాంతంలో చోరీలకు పాల్పడుతూ దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. గ్రామస్తులు, బాధితుల వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌గౌడ్‌కు చెందిన పాత ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువాను పగులగొట్టి రూ.50 వేల నగదు, రెండు తులాల బంగారం, 15 తులాల వెండి ఎత్తుకెళ్లారు. ఇంటి ముందు ఉన్న బైక్ ను తీసుకెళ్లారు. ప్రమీలమ్మ ఇంట్లో నగదు రూ. 10వేలు, బాల్‌రెడ్డి ఇంట్లో నగదుతో పాటు వెండి వస్తువులు, నర్సిరెడ్డి ఇంట్లో చొరబడ్డారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు బాధితులు సమాచారం ఇవ్వడంతో సీఐ రవీందర్, ఎస్‌ఐ రాములు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు.

చెక్‌పోస్టుల వద్ద నగదు స్వాధీనం



కొత్తకోట రూరల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేస్తున్నారు. పెద్దమందడి మండలం మోజర్ల స్టేజీ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు దగ్గర ఎస్‌ఐ శివకుమార్, కేంద్ర బలగాలతో వాహనాల తనిఖీ చేపట్టారు. గురువారం కర్నూలు వైపు వెళ్తున్న బొలెరోను తనిఖీ చేయగా రూ.8,42,190 నగదును ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తుండటంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హన్వాడ: మండలంలోని నాగినోనిపల్లి శివారులో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.లక్ష నగదు పట్టుకున్నారు. మహమ్మదాబాద్‌కు చెందిన గ్రంది శ్రీనివాస్ పత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తుండటంతో సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గద్వాల క్రైం: కుటుంబ ఆర్థిక సమస్యలు తట్టుకోలేక ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గద్వాల మండలంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ పర్వతాలు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూల్ జిల్లా డోన్‌కు చెందిన మల్లారెడ్డి(38) రెండు సంవత్సరాలుగా 99 ప్యాకేజ్ కాల్వ పనుల కాంట్రాక్టర్ వద్ద సైట్ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆర్థిక, కుటుంబ సమస్యలు తాళలేక ఈ నెల 14న తెల్లవారుజామున పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉదయం ఆపస్మారక స్థితిలో పడి ఉండటంతో గమనించిన సైట్‌లోని కూలీలు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య దుర్గమ్మగారినాగరత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అవమాన భారంతోనే...

మృతుడు మల్లారెడ్డి ఓ మహిళతో వివాహేతర సంబంధం, అదే మహిళతో కొండపల్లికి చెందిన మరో వ్యక్తి చనువుగా ఉండటం, సదరు వ్యక్తి దేహశుద్ధి చేసి, భయభ్రాంతులకు గురిచేయడం వంటి సంఘటనలు ఉన్నాయని పలు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ అయ్యాయి. ఈ కారణంగానే మృతుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చనే అనుమానాలు చోటుచేసుకున్నాయి. ఈ సంఘటనపై ఎస్‌ఐ పర్వతాలును 'సాక్షి' వివరణ కోరగా.. ఆర్థిక, మానసిక క్షోభకు గురై పురుగు మందు తాగి ఉంటాడని భార్య ఫిర్యాదు చేసిందన్నారు. అనుమానం ఉంటే విచారణ జరిపి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో మద్యం లభ్యం



ఊట్కూర్‌లో స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం

నారాయణపేట: ఊట్కూర్ మండలంలోని తిమ్మారెడ్డిపల్లితండాలో సారాయి విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందడంతో పేట ఎక్సైజ్‌శాఖ అధికారుల బృందం దాడులు చేపట్టింది. తాండాలోని రాథోడ్ రాజు నాయక్ ఇంట్లో సోదాలు నిర్వహించగా సారాయికి బదులుగా కర్ణాటకకు చెందిన మద్యం లభ్యమైంది. దీంతో అధికారులు అవాక్కయ్యారు. లభ్యమైన మద్యం బాటిళ్లలో కర్ణాటకకు చెందిన ఓరిజినల్ చాయిస్ 180 ఎంఎల్ 47 బాటిళ్లను స్వాధీనం చేసుకుని రాథోడ్ రాజు నాయక్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కర్ణాటక మద్యం బాటిళ్లను ఎక్కడి నుంచి తీసుకువచ్చారంటూ విచారణ మొదలు పెట్టారు. కర్ణాటక మద్యం తీసుకువచ్చి విక్రయిస్తే చట్టరీత్య చర్యలు తప్పవని సీఐ అశోక్‌కుమార్ హెచ్చరించారు.

గోపాల్‌పేట: కిరాణ దుకాణాల్లో మద్యం అమ్మితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. గురువారం మండలంలోని ఏదుట్లలో మూడు బెల్టు షాపులపై దాడులు చేసి మద్యం సీజ్ చేశామని తెలిపారు. ఏదుట్లలో బాల్‌రాజు కిరాణంలో రూ. 6,489 విలువచేసే 14 లీటర్ల మద్యం, కుమ్మరి లింగయ్య కిరాణంలో రూ.13,425 విలువ చేసే 15 లీటర్ల మద్యం, కటిక నాగోజీ దుకాణంలో రూ.8,602 విలువ చేసే 11 లీటర్ల మద్యం, ఏదులలో సీతమ్మకు చెందిన గుడిసెలో 8లీటర్ల సారాయి పట్టుకుని సీజ్ చేశామని తెలిపారు. అలాగే బుద్దారం చెక్‌పోస్టు వద్ద రవికుమార్ శాయిన్‌పల్లి నుంచి గద్వాలకు రూ.66 వేలు తీసుకెళ్తుండగా, అనుమతిపత్రాలు లేకపోవడంతో డబ్బులు సీజ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వివాహిత ఆస్పత్రి టాయిలెట్ గదిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి టూటౌన్ సీఐ స్వామిగౌడ్ కథనం ప్రకారం.. భూత్పూర్ మండలం గోప్లాపూర్‌కు చెందిన నాగమ్మ(26)తో ఈ నెల 13న ఆమె తల్లి కాళ్ల కాడియాల కోసం గొడవపడి తిట్టడంతో మనస్తాపానికి గురై పురుగు మందు తాగింది. దీంతో చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నాగమ్మ ఈ నెల 20న సాయంత్రం టాయిలెట్ గదిలోకి వెళ్లింది. ఈ క్రమంలో ఆమెతోపాటు తల్లి కూడా వెళ్లింది. ఆ తర్వాత నాగమ్మ మెడలో ఉన్న నల్లపూసల దండ తెగి పడి ఉండగా ఆమె మృతిచెందింది. ఈ ఘటనపై నాగమ్మ భర్త చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

వీధికుక్కల స్వైరవిహారం పదిమందికి పైగా గాయాలు

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో వీధి కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో పలువురు గాయపడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో పలు కాలనీల్లో వీధి కుక్కలు గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి. స్థానికులపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. ఇప్పటికే పది మందికి పైగా కుక్కల దాడిలో గాయపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కుక్కల దాడిలో ఓ మహిళకు గాయాలు

క్లుప్తంగా...

ప్రణీత్‌రావు పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం తన విచారణ జరగడం లేదంటూ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కస్టడీ సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించడం లేదని, పీఎస్‌లో నిద్రపోవడానికి సరైన సౌకర్యాలు లేవని, విచారణ పూర్తైన తర్వాత తిరిగి జైలుకు తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరడంతోపాటు పోలీస్ కస్టడీకి ఇస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ప్రణీత్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌లో వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి.. పిటిషన్‌ను కొట్టివేస్తూ గురువారం తీర్పు వెలువరించారు. 2023లో అక్రమంగా ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్ ట్యాంపింగ్‌కు ప్రణీత్‌రావు పాల్పడ్డారు. ఇది చాలా తీవ్ర నేరమని.. నిబంధనల మేరకే ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేస్తోందని వాదనల సందర్భంగా పీపీ నివేదించారు. సాక్ష్యాలను అందించడంలో భాగంగానే రమేశ్ విచారణ జరిగే ప్రాంతానికి వచ్చారు తప్ప.. విచారణలో పాల్గొనలేదన్నారు. 4 రోజుల కస్టడీ పూర్తయిందని, మరో 3 రోజులు మాత్రమే ఉందని చెప్పారు. పీపీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ప్రణీత్‌రావు పిటిషన్ కొట్టివేశారు.

నా కొడుకును రక్షించండి

అబ్దుల్ మహ్మద్ ఆర్ఫద్ తండ్రి సలీం వేడుకోలు

మల్లాపూర్(హైదరాబాద్): అమెరికాలో కిడ్నాప్‌నకు గురైన తన కొడుకు అబ్దుల్ మహ్మద్ ఆర్ఫద్‌ను కాపాడాలని తండ్రి అబ్దుల్ సలీం ఆవేదనతో వేడుకుంటున్నాడు. నాచారం ఏరియాకు చెందిన ఆర్ఫద్‌ను అమెరికాలో డ్రగ్స్ మాఫియా కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. గురువారం మీడియాతో మాట్లాడుతూ రెండు రోజులైనా ఫోన్ రాకపోవడంతో అక్కడే ఉన్న తమ బంధువులకు సమాచారం ఇచ్చినా, వారికి కూడా అతని ఆచూకీ తెలియలేదన్నారు. కిడ్నాపర్ల చెర నుంచి తన కొడుకు రక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.

పోలీసుల ఆరా

ఆర్ఫద్ కిడ్నాప్ విషయం తెలుసుకున్న నాచారం పోలీసులు తండ్రి సలీంను పీఎస్‌కు పిలిచి ఆరా తీశారు. ఆర్ఫద్ ఎప్పుడు అమెరికాకు వెళ్లాడు.. చివరిసారి ఎప్పుడు మాట్లాడాడు, అమెరికాలో ఎక్కడ ఉంటున్నాడు.. ఇంతకు ముందు ఎవరైనా అక్కడ బెదిరింపులకు పాల్పడుతున్నట్టు చెప్పాడా అనే కోణంలో వివరాలు అడిగారు.

యాదాద్రిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



గురువారం యాదాద్రిలో ప్రధాన కలశంతో పాటు వెండి, బంగారు కలశాలకు పూజలు చేస్తున్న ఆచార్యులు, యజ్ఞాచార్యులు.

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం ప్రధానాలయంలో వేకువజామున నిత్య పూజలు నిర్వహించిన ఆచార్యులు వేద మంత్రాలతో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శ్రీస్వామి అమ్మవార్లకు అష్టోత్తర శతఘటాభిషేకం చేశారు. 108 కలశాలలో ఫల రసాలతో, పంచామృతాలతో, శుద్ధ జలంతో స్వయంభూలకు, బంగారు ప్రతిష్టామూర్తులకు వేద మంత్రాలు, పారాయణాలతో శత ఘటాభిషేక మహోత్సవం జరిపారు. రాత్రి 9.30 గంటలకు శ్రీస్వామి వారికి శృంగార డోలోత్సవం ఘనంగా జరిపించి ఉత్సవాలకు ముగింపు పలికారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రద్దు చేసిన నిత్య కళ్యాణం, సుదర్శన నారసింహ హోమం వేడుకలు శుక్రవారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. కాగా ఉదయం, సాయంత్రం జరిగిన వేడుకల్లో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు, అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ధర్మపురి నృసింహుడి కల్యాణం



నృసింహుడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ధర్మపురి: జగిత్యాల జిల్లాలోని ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజైన గురువారం ఆలయంలోని శేషప్ప వేదికపై ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. ప్రభుత్వం తరఫున కలెక్టర్ యాస్మిన్ బాషా పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చారు. రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటలవరకు వేడుక జరిపించారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ రాంబాబు డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అజ్ఞాతంలోకి ప్రభాకర్‌రావు!

ప్రణీత్‌రావు సస్పెండ్ కాగానే ఎస్ఐబీ మాజీ చీఫ్ అప్రమత్తం

- ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు పోలీసుల అనుమానం
- మాజీ డీఎస్పీ కస్టడీ ముగిసిన తర్వాత హైకోర్టును ఆశ్రయించే అవకాశం
- 2018 నుంచే మొదలైన అక్రమ ట్యాపింగ్ దందా
- ఇజ్రాయెల్ నుంచి అత్యాధునిక ఉపకరణాలు ఖరీదు



సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు అజ్ఞాతంలోకి వెళ్లినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈయన ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు భావిస్తున్నారు. ప్రణీత్ రావు కేసును అక్కడి నుంచే నిశితంగా గమనిస్తున్న ప్రభాకర్‌రావు.. అతని పోలీసు కస్టడీ ముగిసిన తర్వాత హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోపక్క సిట్ అధికారులు ప్రణీత్ రావును ఐదో రోజైన గురువారమూ బంజారాహిల్స్ ఠాణాలో ప్రశ్నించారు. తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాల ఆధారంగా మరో నలుగురు పోలీసులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. వీళ్లు గతంలో 'ప్రభాకర్‌రావు సైన్యం'లో కీలక సభ్యులని సమాచారం.

హోదా ఏదైనా బాధ్యత మాత్రం చీఫ్

రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొన్నాళ్లు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) డీసీపీగా పని చేసిన ప్రభాకర్‌రావును ప్రభుత్వం ఏరికోరి ఎస్ఐబీకి డీఐజీని చేసింది. ఐజీగా పదోన్నతి పొందినా అక్కడే కొనసాగారు. చివరకు 2020లో పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును నాటి ప్రభుత్వం ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా నియమించింది. హోదా ఏదైనా ఎస్ఐబీ చీఫ్‌గానే కొనసాగారు. ఇలా ఏళ్లుగా అక్కడ పాతుకుపోయిన ప్రభాకర్‌రావు తనకంటూ ఓ సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

గత ఎన్నికల నేపథ్యంలోనే అడ్డదారి

ఎస్ఐబీలో 2017 వరకు లీగల్ ఇంటర్‌సెప్షన్ (ఎల్ఐ)గా పిలిచే అధికారిక ట్యాపింగ్ మాత్రమే జరిగింది. అయితే ఆ తర్వాత ఎన్నికలు సమీపిస్తుండటం, ప్రతిపక్ష పార్టీలు పుంజుకోవడం గమనించిన ప్రభాకర్‌రావు, అప్పటి కొందరు కీలక రాజకీయ నాయకులు.. అక్రమ ట్యాపింగ్‌పై దృష్టి పెట్టారు. అయితే ప్రతిపక్ష నేతలు తరచుగా వేర్వేరు నంబర్లతో సంప్రదింపులు జరుపుతుండటంతో ప్రభాకర్‌రావు బృందం రష్యా, ఇజ్రాయెల్‌లో పర్యటించి వచ్చింది. ఆయా దేశాల్లో అందుబాటులో ఉన్న ఆధునిక ట్యా పింగ్, ఇతర నిఘా పరికరాలను పరిశీలించి వచ్చింది. ఏవేవి ఖరీదు చేయాలో చెప్పాల్సిందిగా పేర్కొంటూ కొందరు పెద్దలకు నివేదిక సమర్పించింది.

కొనుగోలులో కీలక పాత్ర పోషించిన రవి పాల్

టెక్నికల్ అనుభవం ఉన్న రవి పాల్ అనే నిపుణుడు గతంలో ఇంటెలిజెన్స్ విభాగానికి కన్సల్టెంట్, అడ్వైజర్‌గా పని చేశారు. ప్రభాకర్‌రావుతో పాటు కొందరు కీలక అధికారులతో సన్నిహితంగా మెలిగారు. రవి పాల్ సూచన మేరకు ప్రభాకర్‌రావు ఇజ్రాయెల్ నుంచి సూట్‌కేస్‌లో ఇమిడిపోయి ఉండే అక్రమ ట్యాపింగ్ పరికరం ఖరీదు చేశారు. దీన్ని ప్రణీత్‌రావు టీమ్ ఓ వాహనంలో పెట్టుకుని టార్గెట్ చేసిన వ్యక్తి ఇల్లు, కార్యాలయం సమీపంలో మాటు వేసేది. ఈ పరికరానికి 300 మీటర్ల పరిధిలో ఉన్న ప్రతి ఫోన్ ద్వారా జరిగే కమ్యూనికేషన్ తెలుసుకునే సామర్థ్యం ఉంది.

'ఆదిలాబాద్'కోసం వినియోగించారు

2018లో ఆదిలాబాద్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతారణం నెలకొన్న సమయంలోనూ ఎస్ఐబీ అధికారులు ఈ బ్రీఫ్‌కేస్ ఉపకరణాన్ని వినియోగించారు. రెండు వర్గాలకు చెందిన కీలక నేతలు ఇద్దరిని పట్టుకోగలిగారు. ఈ వ్యవహారాల్లో ప్రణీత్ రావుకు కుడిభుజంగా వ్యవహరించిన ఆరుగురు అధికారులను సిట్ గుర్తించింది. వీరిలో ఇద్దరి నుంచి ఇప్పటికే వాంగ్మూలాలు నమోదు చేయగా.. మరో నలుగురికి విచారణకు హాజరుకావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది.

ప్రణీత్‌రావు సస్పెన్షన్‌తో అలెర్ట్

గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పిడి జరిగిన వెంటనే ప్రభాకర్‌రావు తన ఓఎస్డీ పోస్టుకు రాజీనామా చేశారు. ఆపై కొ న్నాళ్లు హైదరాబాద్‌తో పాటు తన స్వగ్రామంలో ఉ న్నారు. అయితే ఈ నెల మొదటి వారంలో ప్రణీత్ రావుపై సస్పెన్షన్ వేటు పడటంతో అప్రమత్తం అయ్యారు. కుటుంబంతో కలిసి విహార యాత్రకు వెళ్తున్నట్లు చెప్పి నగరం దాటిన ప్రభాకర్‌రావు అ ట్నుంచి అటు అమెరికా వెళ్లిపోయారని పోలీసులు భావిస్తున్నారు. ప్రణీత్ రావు కస్టడీ ముగిసిన తర్వా త ప్రభాకర్‌రావు విషయంలో పోలీసు విభాగం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

సమీక్షలో సీఎస్ శాంతికుమారి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. పోలీసు, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, అటవీ, రెవెన్యూ, రవాణా తదితర శాఖల అధికారులతో గురువారం ఆమె సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎలా పనిచేశారో.. అదే స్ఫూర్తితో రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలోనూ మరింత సమర్థవంతంగా పని చేయాలని కోరారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు ఆయా రాష్ట్రాల చెక్ పోస్టులతో కలసి సమన్వయంతో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో కూడా వివిధ శాఖలు చెక్ పోస్టులను ఏర్పాటు చేశాయన్నారు. ఇప్పటివరకు పోలీసు శాఖ రూ.10 కోట్ల నగదు, పలు లైసెన్స్ లేని ఆయుధాలు, పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్, బంగారాన్ని స్వాధీనం చేసుకుందని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ వస్తువులను నిల్వ చేసేందుకు అవకాశమున్న 25 గోదాములను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని వెల్లడించారు. మరో 141 గోదాములు, 912 వివిధ వస్తువుల తయారీ కేంద్రాలపై కూడా నిఘా ఉంచామన్నారు. మద్యం అక్రమ రావాణాకు అవకాశమున్న ఐదు రైలు మార్గాలను గుర్తించి మద్యం నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో డీజీపీ రవిగుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, పీసీసీఎఫ్ డోబ్రియల్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, అడిషనల్ డీజీ ఎస్.కె. జైన్ పాల్గొన్నారు.

ఎన్నికల బందోబస్తుకు 145 కంపెనీల కేంద్ర బలగాలు



- ఇప్పటికే రంగంలోకి 60 కంపెనీలు
- శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న పార్లమెంటుఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్ తెలిపారు. ఎన్నికల తేదీనాటికి మొత్తం 145 కంపెనీల కేంద్ర బలగాలు బందోబస్తు విధుల్లో ఉండే అవకాశం ఉన్నట్టు చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని గురువారం ఆయన 'సాక్షి'కి తెలిపారు. స్థానిక పోలీసులతోపాటు ఇప్పటికే 60 కంపెనీల కేంద్ర బలగాలు రాష్ట్రవ్యాప్తంగా బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నట్టు వెల్లడించారు. నిబంధనల ప్రకారం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి కనీసం మూడుకు తగ్గకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 440 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, నిరంతరం తనిఖీలు చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.10 కోట్ల వరకు నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నామని సంజయ్‌కుమార్ జైన్ వెల్లడించారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో తనిఖీలు.. మూసివేత



అయిజ: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రిలో జిల్లా వైద్య శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి మూసివేయించారు. గురువారం మండలంలోని వెంకటాపురం స్టేజీలో నిర్వహిస్తున్న ఉషా క్లీనిక్‌ను జిల్లా ఉప వైద్యారోగ్య శాఖ అధికారి సిద్దప్ప, ప్రోగ్రాం ఆఫీసర్, మాతా, శిశు సంరక్షణ అధికారి స్రవంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ఎంపీ తిమ్మారెడ్డి కొన్నేళ్లుగా ఆస్పత్రిని నిర్వహిస్తున్నారని, నిబంధనల ప్రకారం ఆస్పత్రిని రిజిస్ట్రేషన్ చేసుకోలేదన్నారు. అలాగే గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు ప్రాథమిక చికిత్సతోపాటు యాంటిబయాటిక్, స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ మందులు ఇస్తున్నారని, విక్రయాలు చేస్తున్నారని, గర్భ నిర్ధారణ కిట్స్, ప్రయివేటు వైద్యశాలలకు రెఫర్ చేసే స్లిప్‌లను ఆస్పత్రిలో గుర్తించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రిని కొనసాగిస్తున్నందున మూసివేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వైద్య సిబ్బంది మధుసూదన్ రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సామగ్రి మాదే

- క్లారిటీ ఇచ్చిన ట్రాన్స్‌కో ఆపరేషన్ విభాగం

రాజాపూర్: ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా విద్యుత్ సామగ్రి తరలిస్తున్న లారీని మంగళవారం అర్ధరాత్రి రాయికల్ టోల్‌ప్లాజా వద్ద డీసీటీఓ పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన విషయం పాఠకులకు తెలిసిందే. గురువారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఠాణలో ఉన్న లారీలోని సామగ్రి ఏమిటి, ఎక్కడి నుంచి తరలిస్తున్నారనే విషయంపై విచారణ ప్రారంభించారు. ట్రాన్స్‌కో ఆపరేషన్ విభాగానికి చెందిన అధికారులు ఆ సామగ్రి తమదేనని.. వెల్టూరు సబ్‌స్టేషన్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు అధికారిక వివరణ ఇచ్చారు. ఉదయం వేళల్లో హైదరాబాద్ పట్టణంలోకి లారీలకు అనుమతి ఉండదని రాత్రి వేళలో తరలిస్తున్నట్లు డీసీటీఓకు అందజేసిన అధికారిక వివరణలో పేర్కొన్నారు. ఈ విషయంపై డీసీటీఓ మురళి స్పందిస్తూ.. వారు ఇచ్చిన అధికారిక వివరణను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, హైదరాబాద్‌లో ఎక్కడ పని చేస్తున్నారు.. అందుకు సంబంధించిన అధికారిక వర్క్ అగ్రిమెంట్ పత్రాలు చూపించిన తర్వాతే లారీని అప్పగించాలని ఆదేశించారన్నారు. దీంతో లారీ రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచామన్నారు.

అలంపూర్ హుండీ ఆదాయం రూ.45 లక్షలు



హుండీ ఆదాయాన్ని అప్పగిస్తున్న ఆలయ అధికారులు

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠమైన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో గురువారం జరిగిన హుండీ లెక్కింపులో రూ.45,18,974 ఆదాయం వచ్చిందని ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. దేవాదాయశాఖ పర్యవేక్షకురాలు వెంకటేశ్వరమ్మ లెక్కింపు కార్యక్రమానికి పరిశీలన అధికారిగా హాజరయ్యారు. అమ్మవారి హుండీ ద్వారా రూ.38,75,701, స్వామివారి హుండీ ద్వారా రూ.5,81,150 ఆదాయం సమకూరింది. అలాగే అన్నదాన సత్రం హుండీ ద్వారా రూ.2,123 కలిపి మొత్తం రూ.45,18,974 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. అదేవిధంగా మూడు విదేశీ కరెన్సీ, 47.330 గ్రాముల మిశ్రమ బంగారం, 397.78 గ్రాముల మిశ్రమ వెండి లభించింది. కాగా వచ్చిన ఆదాయాన్ని ఏపీజీవీబీలో జమ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ చిన్నకృష్ణయ్య, ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ, పాలక మండలి సభ్యులు వెంకటేష్, మాజీ సభ్యుడు నీలప్ప, ఏపీజీవీబీ మేనేజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జామ్‌లో సక్సెస్ కావాలి

హుండీల లెక్కింపులో కానుక రూపంలో నగదుతో పాటుగా విచిత్రమైన చిట్టీలు కనిపించాయి. 'అమ్మా జోగుళాంబ.. నా కొడుకు ఎగ్జామ్‌లో సక్సెస్ కావాలి.. బంగారు ముక్కుపుడక, చీర, సారె పెడతా అంటూ ఓ తల్లి లేఖ రాసి చిట్టి వేయగా మరి కొందరు 'విషం విషం కాదు.. భక్తుల సొమ్ము నిజమైన విషం. విషం వల్ల ఒక్కసారే మరణిస్తారు. భక్తుల సొమ్మును అపహరించిన వాడి పుత్ర పౌత్రాలు నాశనమవుతారు. భక్తుల సొమ్ముకు ధర్మకర్తగా ఉండాలి. తాను అనుభవించరాదు. దైవ కార్యాలకు వినియోగించాలి. సత్యనిష్ట ఇందులో తప్పక ఆచరించాలి' అంటూ మరికొన్ని లేఖలు లభించాయి.

హనుమత్ వాహనంపై రంగనాథుడు



హనుమత్ వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం యాగశాలలో శ్రీవారి మూలమంత్ర హవనం, బలిహరణం పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. రాత్రి హనుమత్ వాహనసేవ, గోదాదేవికి మండపోత్సవం వైభవంగా జరిగాయి. హనుమద్ వాహనంపై తిరువీధుల్లో స్వామి, అమ్మవార్లు ఊరేగితుండగా భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు విష్ణునారాయణ, అర్చకులు గోవిందాచార్యులు, సురేషాచార్యులు, కన్నయ్యస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దక్షిణకాశీలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



గోపూజ నిర్వహణ



బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తున్న అర్చకులు

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి బ్రహోత్సవాలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో భూతబలి, యాగశాల ప్రవేశం అనంతరం విఘ్నేశ్వర పూజ, అగ్ని ప్రతిష్ఠ, అంకురార్పణ, ధ్వజారోహణం, బలిహరణం కార్యక్రమాలను పండితులు నిర్వహించారు. గోపూజతో పాటు ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు, ధ్వజస్థాపన చేశారు. శుక్రవారం ఉదయం ఆలయంలో పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆవరణలో చలువ పందిళ్లు వేశారు. ఈఓ రాజేశ్వరశర్మ, జూనియర్ అసిస్టెంట్ అనంతసేన్‌రావు, ఆలయ పూజారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



గార్డెన్‌ను సందర్శించిన అటవీ క్షేత్ర అధికారులు

జడ్చర్ల టౌన్: అటవీ సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర అటవి అకాడమి అసిస్టెంట్ కోర్స్ కో-ఆర్డినేటర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం అంతర్జాతీయ అటవీ దినోత్సవం పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్‌ను అకాడమిలో శిక్షణ పొందుతున్న 35 మంది అటవీ క్షేత్రాధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మనం జీవిస్తున్న ప్రాంతంలో వీలైనన్ని మొక్కలు నాటి వాటిని పరిరక్షించేందుకు కృషిచేయాలని సూచించారు. అడవులే మానవాళికి రక్ష అని, అడవుల నుంచి మానవాళికి అవసరమైన ఆహారం, ఔషధం, కలప, ఇతర సామగ్రితో పాటు జీవించటానికి అవసరమయ్యే ప్రాణవాయువు అందిస్తాయన్నారు. గార్డెన్ అభివృద్ధి చేసిన తీరు ఆకర్షించిందన్నారు. తమ వద్ద శిక్షణ పొందుతున్న అటవీ క్షేత్రాధికారులు శిక్షణలో భాగంగా అటవీ ప్రాంతాన్ని సందర్శించాలని, స్థానిక బొటానికల్ గార్డెన్ సందర్శించటంతో అనేక అనుభవాలు, శిక్షణలో ఉపయోగం అవుతుందన్నారు. 2012 నుంచి ఐక్యరాజ్య సమితి మార్చి 21ని అంతర్జాతీయ అటవి దినోత్సవంగా పరిగణించారన్నారు. నాటి నుంచి అనేక దేశాలు ఈ దినోత్సవం జరుపుతున్నాయన్నారు. ప్రతి ఏటా ఒక్కో ప్రత్యేక అంశంతో అటవీ దినోత్సవం నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది 'అడవులు, ఆవిష్కరణలు మెరుగైన ప్రపంచానికి కొత్త పరిష్కారాలు' అనే నేపథ్యంలో జరుపుకొంటున్నామన్నారు. గార్డెన్ సందర్శనకు వచ్చిన వారికి ప్రిన్సిపాల్ డా.అప్పియాచిన్నమ్మ, గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య గార్డెన్‌పై వివరించారు. అదే విధంగా బయోడైవర్సిటీ రీసెర్చ్ ఎడ్యుకేషన్ సెంటర్, స్టేట్ హెర్బేరియంను సందర్శించారు.

లోక్‌సభ అభ్యర్థుల విషయంలో పునరాలోచించాలి

- బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్‌సాగర్



విలేకరులతో మాట్లాడుతున్న బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో అత్యధికంగా ఉన్న బీసీ జనాభాను విస్మరించి, అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు అగ్రవర్ణాలకు సీట్లు కేటాయించారని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్‌సాగర్ ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ సమాజ్ అన్ని కుల సంఘాలు, ప్రజాసంఘాలతో కలిసి ఐక్యతతో ముందుకెళ్లి ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తామని, అభ్యర్థుల విషయంలో ఆయా పార్టీలు పునరాలోచించాలని అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. అభ్యర్థులను ప్రకటించక ముందే అన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు బీసీ సమాజ్ బీసీలకే సీట్లు కేటాయించాలని పలుమార్లు విన్నవించుకున్నామన్నారు. బీసీ సమాజ్ ప్రధాన ఉద్దేశం ఏ పార్టీ నుంచి అయినా బీసీ అభ్యర్థులు ఉంటే వారికి మద్దతు పలకడమేనని అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి బలమైన బీసీ అభ్యర్థిగా ముందుకు వచ్చిన శాంతికుమార్‌కు ఇప్పటికైనా బీజేపీ అధిష్టానం చొరవ తీసుకొని 62 శాతం బీసీ జనాభా ఉందని, సీటు కేటాయిస్తే సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామని తెలియజేశారు. సమావేశంలో జాంద్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కోకన్వీనర్ సవారి సత్యం, దేవరకద్ర కన్వీనర్ శేఖర్, సభ్యులు ఆంజనేయులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు సముచిత స్థానం కల్పించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎంపీటీసీలకు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గది ఏర్పాటు చేయాలని ఎంపీటీసీల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంకిళ్ల రఘునాథ్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీల్లో ప్రత్యేక గదితో ప్రత్యేక కుర్చీ, టేబుల్‌ను ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో సముచిత స్థానం కల్పించాలన్నారు. ఎంపీటీసీల వేతనం అదనంగా 50 శాతం పెంచాలని, అభివృద్ధి నిధులు ప్రతి ఎంపీటీసీకి ఏటా రూ.20 లక్షల చొప్పున బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, మండల ప్రాథమిక పాఠశాల్లో జాతీయ జెండా ఎగురవేసే అవకాశం కల్పించాలని, మండల పరిషత్ నిధులచే జరిగే పనులకు తీర్మానం ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని, మండల, గ్రామ ప్రతి అభివృద్ధి కమిటీలో ఎంపీటీసీలను సభ్యులుగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు గతంలో లాగా 20 శాతం నిధులు కేటాయించాలని, వెలుగు గ్రామ మహిళా సమాఖ్యకు మహిళా ఎంపీటీసీని చైర్మన్‌గా, మండల పరిషత్ పాఠశాలల్లో ఎంపీటీసీలను చైర్మన్లుగా నియమించాలని కోరారు. రేషన్‌షాపులపై పర్యవేక్షణ బాధ్యత అప్పగించాలని, సీనరేజ్ స్టాంప్ డ్యూటీలపై వచ్చే నిధులు పంచాయతీలు మండల, జిల్లా పరిషత్ వాటాలను గతంలో మాదిరిగానే కేటాయించాలని డిమాండ్ చేశారు. మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులకు మండల సర్వసభ్య సమావేశంలో గౌరవించేలా చర్యలు తీసుకోవాలన్నారు.